క్లుప్తంగా

ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ బోధన



రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ బోధన చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో డిజిటల్ విద్యా బోధన మొదలైంది. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు గురువారం మాట్లాడుతూ.. ప్రభుత్వం నాడు–నేడు కింద నిధులు మంజూరు చేసిందని, వాటితో తొమ్మిది తరగతి గదుల్లో ఒక్కొక్కటి చొప్పున తొమ్మిది డిజిటల్ టీవీలను అమర్చామని చెప్పారు. వాటికి నెట్ సౌకర్యం కల్పించి డిజిటల్ విద్య బోధన ప్రారంభించినట్లు వివరించారు.

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: అవయవదానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మ కలుగుతుందని రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా శాంతిరాం వైద్య కళాశాల యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవయవదానం పట్ల అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు ముందుకు రావాలన్నారు. అనంతరం డాక్టర్లు, వైద్యసిబ్బందితో అవయవదాన ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

పంటల్లో తెగుళ్ల నిర్ధారణ ముఖ్యం



పొలంలో ఏరువాక నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

గోస్పాడు: రైతులు సాగు చేసిన మొక్కజొన్న, మినుము పంటలలో తెగుళ్లను నిర్ధారణ చేయడం అవసరమని నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో గురువారం మొక్కజొన్న మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలలో తెగుళ్లను నిర్ధారించారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు, మినుము పంటలో పల్లాకు వైరస్ తెగులు సోకినట్లు గుర్తించామని, నివారణ పద్ధతలను వివరించారు. డీఆర్‌సీ నంద్యాల వ్యవసాయ అధికారిని ప్రభావతమ్మ పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టుకు విద్యార్థుల ఎంపిక



నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీచైతన్య ఎన్–4 బ్రాంచ్ విద్యార్థులు నాసా స్పేస్ సెటిల్‌మెంట్ ప్రాజెక్టు ఎంపికయ్యారని పాఠశాల ఏజీఎం సురేష్ గురువారం తెలిపారు. మొత్తం 30మంది విద్యార్థులు కలిసి పది ప్రాజెక్టులు చేయగా.. వారిలో నాలుగు ప్రాజెక్టులు నాసా స్పేస్‌కు ఎంపికయ్యాయని, ఆ ప్రాజెక్టులు నిర్వహించిన పది మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆర్ఐ కోటయ్య చౌదరి, ఏసీఓ గోవింద్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, ఏఓ శేఖర్, సీబ్యాచ్ డీన్ ప్రసాద్, ఫరీద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



రుద్రవరంలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

రుద్రవరం: సమస్యల పరిష్కారానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని డీఎల్‌పీఓ రాంబాబు సూచించారు. మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల,రుద్రవరం గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, స్పందన రికార్డులు, పరిష్కారం అయినవి, పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు నిరుపయోగంగానున్న చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాడు

గతంలో ఏదైనా ధ్రువ పత్రం పొందాలంటే మున్సిపల్, రెవెన్యూ తదితర కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. ఒక వేళ అధికారులు, కింది స్థాయి సిబ్బంది చేతులు తడిపినా కుల, ఆదాయ ధ్రువ పత్రాలు కూడా త్వరగా అందేవి కాదు. ఇక ఫ్యామిలీ మెంబర్, ఆరోగ్యశ్రీ , రేషన్ కార్డు వంటివి పొందడం ఒక ప్రహసనం. చివరకు అన్ని రకాల పాట్లు పడి ధ్రువ పత్రాలు పొందినా.. వివిధ కారణాలను సాకుగా చూపి పథకాలకు అనర్హులుగా చూపేవారు. తాము పలానా పథకానికి అర్హులమని చెప్పుకున్నా ఆలకించే నాథుడు లేడు. దీంతో అధిక శాతం పేదలకు పథకాలు వర్తించలేదు. ఇక తమ పార్టీ, అనుకూలురు.. తదితర ముద్ర ఉన్న వారికి మాత్రం అర్హత లేకపోయినా వర్తింపజేసేవారు. మరి కొందరికేమో ఏ ధ్రువ పత్రానికి ఏ కార్యాలయం వెళ్లి ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో తెలియని దుస్థితి ఉండేది.

నేడు

గ్రామీణులే కాదు.. ఎవరైనా ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు, ఏ ఒక్కరికీ రొక్కం సమర్పించాల్సిన అవసరం లేదు. అర్హులు ఎవరైనా పథకాలకు దూరంగా ఉన్నారా.. అని ప్రభుత్వ అధికారులు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సాయంతో ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అర్హులుంటే వారికి ఏ పథకం వర్తిస్తుందో, 11 రకాల ధ్రువ పత్రాల్లో ఏ ధ్రువ పత్రం అవసరమో గుర్తించి మూడు నుంచి నాలుగు రోజుల్లో గ్రామానికి వచ్చి ఉచితంగా అందజేసి లబ్ధిదారులుగా మార్చి సుభిక్షంగా మార్చుతున్న వినూత్న కార్యక్రమమే జగనన్న సురక్ష.

‘సురక్ష’తో సుభిక్షం

- నంద్యాలలో ‘జగనన్న సురక్ష’ సూపర్ హిట్
- పట్టణంలో 35,334 మందికి ధ్రువ పత్రాల అందజేత
- అత్యధికంగా ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు
- 42 వార్డుల్లో కార్యక్రమం నిర్వహణ

అర్హులెవరూ పథకాలకు దూరంగా ఉండకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వివిధ సాంకేతిక కారణాలతో పథకాలు అందని అర్హులకు అవసరమైన ధ్రువ పత్రాలను గ్రామంలోనే ఉచితంగా అందజేసి లబ్ధిదారులకు మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు గతనెల 1నుంచి 27వ తేదీ వరకు నంద్యాల పట్టణంలో నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైంది. 42 వార్డుల్లోని 48 సచివాలయాల పరిధిలో 35,334 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు.



నూనెపల్లెలో సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైరపర్సన్



6వ వార్డులో నిర్వహించిన సురక్ష క్యాంపులో ప్రజల వివరాలను నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

నంద్యాల(సిటీ): అర్హత ఉండి కేవలం ధ్రువ పత్రాలు లేక ఎంతో మంది ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని గ్రహించిన సీఎం వైఎస్ జగన్ ఒకే వేదికపై ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపాలని సంకల్పించి ప్రారంభించిన కార్యక్రమమే జగనన్న సురక్ష. పట్టణంలో ఈ కార్యక్రమం పేదలకు శ్రీరామ రక్షగా మారింది. సురక్ష క్యాంపులలో సుమారుగా 11 రకాల ధ్రువ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న 7రోజుల లోపు ఉచితంగా దరఖాస్తుదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. నంద్యాల పట్టణంలో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఇందుకు గాను పట్టణంలోని 42 వార్డుల్లోని 48 సచివాలయాల్లో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ప్రతి గృహాన్ని సర్వే చేశారు. అర్హత ఆధారంగా ఎటువంటి రుసుము లేకుండా అవసరార్థులకు ధ్రువ పత్రాలను మంజూరు చేశారు. పట్టణంలోని 62,186 గృహాలకు గాను 59,163 గృహాలను సందర్శించిన అధికారులు 95.14 శాతం సర్వే చేశారు. ఇందుకు మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కసరత్తు చేసి నిర్ణీత గడువులోపు ప్రజలకు ధ్రువ పత్రాలను మంజూరు చేశారు.

7రోజుల్లో ధ్రువ పత్రాలు జారీ..

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి టోకన్లు జారీ చేశారు. ఆన్‌లైన చేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, విచారణ చేసి 7 రోజులలోపు అర్హులకు ధ్రువ పత్రాలు మంజూరే చేశారు. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో సురక్ష కార్యక్రమం నిర్వహించి ఉచితంగా ధ్రువపత్రాలను అందజేశారు.

పట్టణంలో సురక్ష క్యాంపుల్లో పంపిణీ చేసిన ధ్రువ పత్రాల వివరాలు..	
ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్	18,265
ఆదాయ ధ్రువీకరణ	16,632
రేషన్ కార్డులు	402
లేట్‌బర్త్,డెత్ సర్టిఫికెట్లు	06
మ్యుటేషన్	05
ఫ్యామిలీ మెంబర్	05
ఆరోగ్యశ్రీ	10
ఇతరములు	09
మొత్తం	35,334

ఆరోగ్యశ్రీ రాదనుకున్నా..



గతంలో ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఎన్నో రోజులు కార్యాలయాల చుట్టూ తిరిగాం. ఒక అధికారి సంతకం చేస్తే మరో అధికారి సంతకం కోసం వారాల పాటు వేచి చూశాం. ఇలా నెలల తరబడి నిరీక్షించాం. చివరకు లాభం లేదనుకుని, తిరగలేక మానుకున్నాం. అయితే.. జగనన్న సురక్ష పేరుతో వలంటీర్లు మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకొని వారం గడవక ముందే ఆరోగ్యశ్రీ కార్డును ఇంటికి తెచ్చి ఇచ్చారు. ఇంత త్వరగా అందజేస్తారుని ఊహించలేదు. ఏదో టైం పాస్ కోసం చేస్తున్నారని అనుకున్నా. జగనన్న మంచి పని చేశారు. పేదల అవస్థలను తప్పించి నిజమైన అర్హులకు అందేలా చేస్తున్నారు.

–చాంద్‌బాషా, కొలిమిపేట, నంద్యాల

ఉచితంగా ధ్రువ పత్రాలు ఇచ్చారు



కుల, ఆదాయ ధ్రువ పత్రాలు పొందడానికి నెలల తరబడి తిరిగాం. అయితే ఇటీవల జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మా ఇంటికి వచ్చి ఏవేవో రాసుకొని వెళ్లి మళ్లీ ఇంటికొచ్చి ధ్రువ పత్రాలు అందజేశారు. ఇందుకు ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. ఇలా ప్రజలకు ఇబ్బందులు తప్పించేలా చేయడం తొలిసారి చూస్తున్నాం. మంచి పనులను ఎవరైనా మెచ్చుకోవాల్సిందే. –రంగమ్మ, 25వ వార్డు నంద్యాల

సురక్షతో చేయూతకు అర్హత



గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాల గురించి మాకు చెప్పే వారు లేరు. కానీ నేడు మా ఇంటి వద్దకు ప్రభుత్వ యంత్రాంగం వచ్చి మీరు చేయూతకు అర్హులని చెప్పి నాకు అవసరమైన ధ్రువ పత్రాలను సురక్ష కార్యక్రమం ద్వారా పొందాలని దరఖాస్తు చేశారు. కుల ఆదాయ ధ్రువ పత్రాలు లేనందున నేను గతంలో చేయూత పథకానికి అర్హత కోల్పోయాను, కానీ నేడు వలంటీర్లు ఇంటి వద్దనే నాకు కుల ఆదాయ ధ్రువపత్రాలను అందించి, చేయూతకు అర్హత కల్పించారు.

– ప్రభావతమ్మ, ఊడుమాలపురం

దరఖాస్తు దారులందరికీ ధ్రువపత్రాలు పంపిణీ చేశాం



27 రోజుల పాటు మున్సిపల్, సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహకారంతో అన్ని వార్డుల్లో సురక్ష క్యాంపులు నిర్వహించాం. ముందుగా అర్హుల వివరాలను సురక్ష క్యాంపు నిర్వహించడానికి వారం ముందే ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి, వారికి అవసరమైన ధ్రువపత్రాల కోసం రిజిస్ట్రేషన్లు చేపట్టారు. అంతే కాకుండా అర్హత మేరకు దరఖాస్తు దారులందరికీ ధ్రువపత్రాలను ఉచితంగా అందించారు. పట్టణంలో సుమారు 35,334 ధ్రువపత్రాలను పంపిణీ చేశాం.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

పేదల అభ్యున్నతే లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నంద్యాల రోడ్డు, కోవెలకుంట రోడ్డు పరిధిలోని పలు కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి వారు అందుకున్న సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, పచ్చ మీడియా విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు అశ్వర్థరెడ్డి, సరిత, నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జనార్ధనరెడ్డి, ఆజాద్, నజీర్ ఉన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం: సంపూర్ణ పోషకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆర్.నాగులవరం గ్రామ సర్పంచు గంధం సావిత్రమ్మ అన్నారు. గురువారం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం పరిధిలోని గర్భిణులు,బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

చాగలమర్రి: ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లి పాల వారోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక 9, 17, 18 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు మండల కో–ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం వైఎస్సాఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

నంద్యాలటౌన్: బిడ్డకు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా రక్షణ కలుగుతుందని డాక్టర్ మాధవి అన్నారు. తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకుని గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా వైద్యుల విభాగం ఆధ్వర్యంలో ఎన్‌జీఓ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాలివ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రాకుండా ఉంటాయన్నారు. అనంతరం మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్లు వసుధారాణి, నర్మద, సౌజన్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందని 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్త హీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్‌లు తోడ్పడుతున్నాయన్నారు. స్థానిక దేవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ హోం రేషన్‌ను పంపిణీ చేశారు.

రక్త పరీక్షలే కీలకం



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: వ్యాధి నిర్ధారణలో రక్త పరీక్షలు కీలక పాత్ర వహిస్తాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పుల వంటి అనారోగ్య లక్షణాలతో వైద్య చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఖచ్చితంగా రక్త పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే పరీక్షల ఫలితాలు త్వరగా ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మాట్లాడుతూ మలేరియా, డెంగీ లక్షణాలతో వైద్యం కోసం వచ్చే వారికి ప్రత్యేకంగా పరీక్షలు చేయాలని చెప్పారు. ఆర్‌డీటీ కిట్స్‌ను ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిల్వ ఉంచాలని సరఫరాలో జాప్యం ఉంటే తనను నేరుగా సంప్రదించాలన్నారు. డాక్టర్లు కాంతారావు నాయక్, వినయ్, ఏఎంఓ వరప్రసాద్ రెడ్డి, సరోజ పాల్గొన్నారు.

సంక్షిప్తం

కుక్కల బెడదకు చెక్

నంద్యాల(అర్బన్): కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఇటీవల మండలంలోని రాయమాల్పురం గ్రామ ప్రజలు సచివాలయ సిబ్బందికి మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది గురువారం వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి దాదాపు 30 కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించారు. ఈఓఆర్‌డీ మహీధర్‌రెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీపీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13వ తేదీన ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, సుబ్బరాయుడు తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సుబ్బరాయుడు, ఉప కార్యదర్శిగా నారాయణ, సహాయ కార్యదర్శిగా బాలవర్ధిరాజు, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, మహేశ్వరమ్మ, ఎస్‌రంగనాయుడు, కోశాధికారిగా లక్ష్మీదేవితో పాటు 21మంది జిల్లా సమితి సభ్యులను ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని, డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అదనపు కార్యదర్శి రాజు, అధ్యక్షుడు సుబ్బన్న కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలు, ఆర్జిత సెలవులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలన్నారు. పెండింగ్ జీతాలను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసులు, దేవేంద్రుడు, భాస్కర్, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, దేశ రక్షణ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ మోదీ.. సేవ్ ఇండియా పేరుతో ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే కార్మిక మహాగర్జనలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి ఈ దేశ ఆర్థిక సంపదను వారికి దోచిపెడుతున్నా రన్నారు. కార్మికులకు కనీస వేతనం లేక నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి సుంకయ్య, రమేష్‌బాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- అధికారంలో ఉన్నన్నాళ్లు సీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- ప్రజలను మభ్యపెట్టేందుకే ‘ప్రాజెక్టుల సందర్శన’
- రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ధ్వజం



గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ: తాను అధికారంలో ఉన్ననాళ్లు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం శిరివెళ్ల మండలం గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి, బాషా, డ్రైవర్ ఖాశీం, చంటి, ఖాశీం, నాగమ్మ తదితర 10 కుంటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. రాయలసీమలోని సాగు, తాగు నీటి ప్రాజెక్టుల కోసం చంద్రబాబు ఏం చేశారో ఒక్కటైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు గుర్తుకురాని రాయలసీమ రైతుల కష్టాలు, అధికారం పోతే వెంటనే గుర్తుకు వస్తాయా అని నిలదీశారు. నీరు – చెట్టు పేరుతో నిధులు దండుకోవడం తప్ప చిత్త శుద్ధితో పనులు పూర్తి చేసి నీళ్లు పారించిన పాపన పోలేదని మండిపడ్డారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టిందుకు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన అని కొత్త డ్రామాకు తెర లేపాడని ఎద్దేవా చేశారు.

కాపు నేస్తంకు 31 దరఖాస్తులు

శిరివెళ్ల: మండలంలో కాపు నేస్తం పథఖానికి కొత్తగా 31 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. మండల కేంద్రం శిరివెళ్లలో 7, యర్రగుంట్ల 10, గోవిందపల్లె ఒకటి, గుంప్రమాన్‌దిన్నె 2, జీనేపల్లెలో 4, కోటపాడులో ఒకటి, మహదేవపురంలో 6 అందాయని చెప్పారు. అలాగే వాహన మిత్రకు కొత్తగా 82 దరఖాస్తులు అందాయన్నారు. శిరివెళ్లలో 29, గోవిందపల్లె 9, యర్రగుంట్ల 5, గుంప్రమాన్‌దిన్నెలో 5, జీనేపల్లె 4, కోటపాడు 5, చెన్నూరు 4, బోయలకుంట్ల 6, గంగవరంలో 4, గుండంపాడు 3, మహదేవపురంలో 8 దరఖాస్తులు అందాయని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

దొర్నిపాడు: మండలంలో చాకరాజువేముల (ఓసీ–జనరల్), బుర్రారెడ్డిపల్లె సచివాలయం రామచంద్రాపురం (ఓసీ–మహిళ)లో ఒక్కొక్కటి చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 7న పరిశీలన, 8న మౌఖిక పరీక్ష, 9న వలంటీర్ల ఎంపిక, 10న శిక్షణ, 11 విధుల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరంలో ఎస్సీ పురుషుడు ఒకటి, హరినగరంలో ఎస్టీ మహిళ ఒకటి చొప్పున వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల వారు 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

రుద్రవరం: మండలంలోని ముత్తలూరులో సింగిరిగాళ్ల హరిప్రసాదు (32) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య సుజాతకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలు గురువారం పంచాయతీ కార్యదర్శి పాములేటి, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, సచివాలయ కన్వీనర్ భాస్కరె డ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, బద్రి నారాయణ,వెంకటరాముడు, శంకర్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి అందజేశారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఈనెల 9వ తేదీన కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి గిరిజనులు తరలి వచ్చి విజయవంతం చేయాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, దళిత గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వామినాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం గిరిజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, సమస్యల పరిష్కారానికి వేదిక కానున్న ఆదివాసి దినోత్సవానికి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా బంజార సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్, ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యదర్శి సుంకన్న, ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీజేపీ మైనార్టీ మోర్చ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌బాజీ తెలిపారు. గురువారం ఓ హోటల్‌లో బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ మైనార్టీ మోర్చ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ అన్ని ముస్లిం వర్గాలను కలుస్తున్నామని, వెనుకబడిన దూదేకుల, నూర్‌బాషా తదితర సంఘాలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. మైనార్టీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా, జిల్లా అధ్యక్షుడు బుద్ధా శ్రీకాంతరెడ్డి, అబ్దుల్‌రజాక్, కరీముల్లా, ముక్తియార్‌బాషా పాల్గొన్నారు. అనంతరం పట్టణ దూదేకుల సంఘం నాయకులు షేక్‌బాజీ ఘనంగా సన్మానించారు.

జీతాలు మంజూరు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు రాలేదని, ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు అజాం బేగ్, ప్రధాన కార్యదర్శి మౌలాలి కోరారు. గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సుబ్బయ్య, నాగేంద్రకుమార్, నాగరాజు, గురునాథ్ పాల్గన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7, 8 తేదీల్లో నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, బాలవెంకట్, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేష్‌భూపాల్, శివప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ నెలలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాల బిల్లులు, ట్రెజరీలకు పంపకపోవడంతో జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధుసూదన్‌రావు, లింగమయ్య, పుల్లయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంటలు కళకళ



యాళ్లూరు సమీపంలో కళకళలాడుతున్న మినుము పైరు



దీబగుంట్ల పొలాల్లో పచ్చగా మొక్కజొన్న పంట



అంతరసేద్యం చేస్తున్న కూలీలు

గోస్పాడు: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు సాగు చేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 700 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా రైతులు కొంత మేరకు మాత్రమే పైర్లు సాగు చేస్తున్నారు. మండలంలో రైతులు అధిక భాగం కేసీ కెనాల్ పరిధిలో వరి పంట సాగు చేస్తారు. పలుచోట్ల మినుము, మొక్కజొన్న, పెసరతో పాటు సాలువరి సాగు చేస్తున్నారు. ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు అందుకు అనుగుణంగా పంటలు సాగు చేస్తున్నారు. కొందరు రైతులు వరి నారు పోసుకొని కేసీ కాలువ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. వారం క్రితం కురిసిన వర్షాలకు ముందుగా పంటలు సాగు చేసిన రైతులు పంటల్లో కలుపు తొలగింపు తదితర పనుల్లో బిజీగా ఉన్నారు.